కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడండి

వికారాబాద్, మే 29: కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలని బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి రాజేందర్ గౌడ్ బుధవారం కలెక్టరేట్‌లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎన్నో మార్లు వినతి పత్రాలు, ర్యాలీలు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోక పోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు అప్రమత్తమై చర్య లు తీసుకోకపోతే రానున్న రోజుల్లో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతానని తెలిపారు.

సజావుగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

వికారాబాద్, మే 29 : వికారాబాద్ జిల్లాలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం సజావుగా సాగాయి. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు మొదటి సంతవ్సరం పరీక్షలు, మధ్యాహ్నం 2:30 నుంచి సాయం త్రం 5:30 గంటల వరకు ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరుగుతున్నాయి. మొదటి సంవత్సరం జనరల్‌లో 2,509 మంది విద్యార్థులకు గాను 2,403 మంది హాజరు కాగా, 106 మంది గైర్హాజరు అయ్యారు. ఒకేషనల్‌లో 311మంది విద్యార్థులకు గాను 302 మంది హాజరు కాగా, 9 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 2820 మంది విద్యార్థులకు 2705 మంది హాజరు కాగా, 115 మంది గైర్హాజరు అయ్యారు. ద్వితీయ సంవత్సరం జనరల్‌లో 870 మందికి గాను 832 మంది హాజరు కాగా, 38 మంది గైర్హాజరు అయ్యారు. ఒకేషనల్‌లో 177 మందికి గాను 171 మంది హాజరయ్యారు. ఆరుగురు గైర్హాజరు అయ్యారు. మొత్తం 1,047 మందికి 1,003 మంది హాజరు కాగా, 44 మంది గైర్హాజరు అయినట్లు ఇంటర్ నోడల్ అధికారి శంకర్‌నాయక్ తెలిపారు.

నిషేధిత గుట్కాలను విక్రయిస్తే చర్యలు

కులకచర్ల, మే 29 : కిరాణం దుకాణాల్లో నిషేధిత గుట్కాలను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని కులకచర్ల ఎస్ఐ అన్వేశ్ రెడ్డి తెలిపారు. బుధవారం కులకచర్ల మండల కేంద్రంలోని పలుదుకాణాల్లో సోదాలు నిర్వహించి గుట్కాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాల్లో గుట్కాలను విక్రయించరాదని, విక్రయిస్తున్నట్లు తెలిస్తే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్వాధీనం చేసుకున్న గుట్కాల విలువ రూ.1500 ఉంటుందని తెలిపారు.

విత్తనాల కొనుగోలులో అవగాహన తప్పనిసరి

ధారూరు, మే 29 : ప్రభుత్వ అనుమతి ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ శాఖ విస్తరణ అధికారి మంజుల అన్నారు. బుధవారం మండల పరిధిలోని ధర్మాపూర్ గ్రామంలో రైతులకు విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో భూసార పరీక్షా నమూనా సేకరణ గురించి రైతులకు వివరించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ విస్తరణ అధికారి మంజుల మాట్లాడుతూ రైతులు తప్పకుండా వ్యవసాయ శాఖ అధికారుల సలహా, సూచనలు పాటించాలని తెలిపారు. రైతులు విత్తనాల కొనుగోలు విషయంలో లైసెన్స్ జారీ చేసిన దుకాణంలో విత్తనాలు కొనుగోలు చేసి తప్పకుండా రసీదు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు తదితరులు ఉన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ విస్తరణ అధికారి మంజుల

వికారాబాద్, మే 29 :జిల్లా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు.శిబిరాన్ని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్‌గౌడ్, సీఐ రాఘవీణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం మహాదానమని, రక్తం దానం చేయడం వలన ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడగలుగుతారన్నారు. ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సైలు వాణి, ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బడిబాటపై సమావేశం

బొంరాస్‌పేట, మే 29 : వచ్చే నెల 3వ తేదీ నుంచి నిర్వహించే బడిబాట కార్యక్రమంపై మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఉదయం11.30 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంఈవో రాంరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో విద్యార్థుల యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాల పంపిణీ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో కొనసాగుతున్న పనులపై చర్చిస్తామని, మండలంలోని అన్ని పాఠశాలల హెచ్ఎంలు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల చైర్‌పర్సన్లు హాజరు కావాలని ఎంఈవో తెలిపారు

12 ఏండ్లుగా అదే పని..

తాళాలు పగులగొట్టి ఇండ్లల్లో చోరీ

నాలుగు సార్లు పీడీ ప్రయోగించినా మార్పురాని వైనం

సిటీబ్యూరో, మే 29 (నమస్తే తెలంగాణ): ఇంటి తాళాలు పగలగొట్టి దొంగతనాలకు పాల్పడుతున్న పాత నేరస్తుడితో పాటు దొంగిలించిన సొమ్మును కొనుగోలు చేస్తున్న మరో పాత నేరస్తుడిని సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మీపెరుమాళ్ కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్‌కు చెందిన రత్లావత్ శంకర్ నాయక్ అలియాస్ రాజేశ్ రెడ్డి 12 ఏండ్లుగా ఇండ్లల్లో దొంగతనాలు చేస్తూ పోలీసులకు పట్టుబడుతూ వస్తున్నాడు. అతడిపై నాలుగు సార్లు పీడీయాక్టు ప్రయోగించినా.. నేరబుద్ధిని మాత్రం మార్చుకోలేదు. ఇటీవల జైలు నుంచి బయటకు వచ్చిన అతడు రాచకొండ, సైబరాబాద్, మహబూబ్‌నగర్, వనపర్తి ప్రాంతాల్లో దొంగతనాలు చేశాడు. తక్కువ కాలంలోనే 8 ఇండ్ల తాళాలు పగలగొట్టి చోరీలకు పాల్పడ్డాడు. విశ్వసనీయ సమాచారంతో సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ బృందం ప్రధాన నిందితుడైన రత్లావత్ శంకర్ నాయక్‌ను అరెస్టు చేసింది. దొంగిలించిన సొమ్మును మరో పాత నేరస్తుడైన బంద్రవల్లి రాకేశ్ అలియాస్ రాఖీ ద్వారా ఇతరులకు విక్రయిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు అతడిని కూడా అరెస్టు చేశారు. ఇద్దరి నుంచి రూ. 6.7 లక్షల విలువైన 80 గ్రాముల బంగారం, 25 గ్రాముల వెండి, ఒక బైక్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

మర్పల్లి, మే 29: మండల కేంద్రంతో పాటు పట్లూర్, పంచలింగాల్ గ్రామాల్లో నిర్మించిన వైకుంఠధామలను, నర్సరీలను డీపీవో జయసుధ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం నాటికి హరితహారంలో మొక్కలు నాటేందుకు సిద్ధం చేయాలని, మొక్కలు ఎండకుండా చూడాలన్నారు.. ఆమె వెంట ఎంపీడీవో రాజమల్లయ్య, ఎంపీవో సుశీల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్ ఉన్నారు

ఆయుర్వేదమంటూ పనిచేయని మందులిస్తూ..

వెంగళరావునగర్, మే 29: ఆయుర్వేద వైద్యం పేరిట అమాయకులను నమ్మించి డబ్బు, బంగారాన్ని దోచుకుంటున్న నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. కర్ణాటకకు చెందిన రవిశెట్టి (42), పుణేకు చెందిన సాగర్ రాజు పర్వార్ (38) వెన్నెముక వ్యాధికి ఆయుర్వేదంలో మంచి చికిత్స ఉన్నదని చెప్పారు. బాధితుడు సచిన్ గుప్తా నుంచి రూ.3లక్షల 80వేల 814 నగదుతో పాటు బంగారు బిస్కెట్‌ను కూడా తీసుకున్నారు. పనిచేయని మందులతో మోసగించారు. దీంతో బాధితుడు సచిన్ గుప్తా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితులిద్దరిని బుధవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

నకిలీ పాస్‌పోర్టు కేసులో కస్టడీ

నాంపల్లి కోర్టులు, మే 29 (నమస్తే తెలంగాణ) : నకిలీ పాస్‌పోర్టు కేసులో మద్రాసు హైకోర్టు ఎదురుగా ఉన్న మ్యాట్ ఎంటర్‌ప్రైజెస్‌లో సేల్స్ అడ్మిన్‌గా పనిచేస్తున్న ప్రియ ధర్మలింగం అనే మహిళలను 2 రోజుల సీఐడీ కస్టడీకి అనుమతిస్తూ బుధవారం కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. పోలీసులు ఈ కేసులో ఆమెను 27వ నిందితురాలిగా ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారు. గురువారం ఉదయం 11 గంటలకు ఆమెను చంచల్‌గూడ మహిళా జైలు నుంచి సీఐడీ కార్యాలయానికి తరలిస్తారు. 31న విచారణ పూర్తిచేసిన తర్వాత ఉస్మానియా ఆస్పత్రికి తీసుకువెళ్తారు. అక్కడ ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉదయం 11 గంటలలోపు 6వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు ఎదుట నిందితురాలిని హాజరు పర్చాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆమె తరపు న్యాయవాది సమక్షంలో విచారించాలని, ఎలాంటి ఒత్తిడికి ఆమెను గురి చేయరాదని న్యాయస్థానం ఆదేశించింది.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలి

బావిపూడికతీత పనులను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సుబ్రహ్మణ్యం

కులకచర్ల, మే 29 : తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం మండల పరిధిలోని గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బావి పూడిక తీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకొని ప్రజలకు తాగునీటిని అందించాలని సూచించారు. కార్యక్రమంలో కులకచర్ల ఎంపీటీసీ ఆనందం, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు

బస్సు బ్రేక్ ఫెయిల్ ...తృటిలో తప్పిన ప్రమాదం



వికారాబాద్, మే 29 : తాండూరు డిపో కు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు బ్రేక్ ఫెయిల్ అయిన ఘటన అనంతగిరిలో బుధవారం చోటు చేసుకున్నది. బస్సు హైదరాబాద్, వికారాబాద్ ప్రయాణికులతో తాండూరుకు బయలు దేరింది. వికారాబాద్ అనంతగిరి గుట్టపై బ్రేక్ ఫెయిల్ కావడంతో డ్రైవర్ బస్సును అక్కడే నిలిపి వేశాడు. ఇది జరిగిన స్థలం నుంచి కొద్ది దూరం ముందుకు పోతే ఘాట్ రోడ్డు వచ్చేది. బస్సు డ్రైవర్ ముందు జాగ్రత్తగా బస్సు అనంతగిరిలో నిలిపివేసి ప్రయాణికుల ప్రాణాలు కాపాడాడు.

నిషేధిత మత్తు పదార్థాల విక్రయం.. కేసు నమోదు

కిరాణా షాపులో తనిఖీ చేస్తున్న ఎస్సై ఆనంద్‌కుమార్

దోమ, మే 29 : నిషేధిత మత్తు పదార్థాలు విక్రయించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. దోమ మండల కేంద్రంలోని వివిధ కిరాణా షాపులు, పాన్ డబ్బాల్లో బుధవారం ఎస్సై ఆనంద్‌కుమార్ తన సిబ్బందితో కలిసి ఏకకాలంలో మూడు బృందాలుగా తనిఖీలు నిర్వహించగా, రెండు కిరాణా షాపులు, ఒక పాన్ డబ్బాలో నిషేధిత మత్తు పదార్థాలు లభించగా, ముగ్గురు యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే నిషేధిత మత్తు పదార్థాలను విక్రయిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

▪ ఉచిత కంటి వైద్య శిబిరం

ఉచితకంటి వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు, గ్రామస్తులు

కులకచర్ల, మే 29 : కులకచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు సీహెచ్‌వో చంద్రప్రకాశ్, ఆప్తాల్మిక్ జవహర్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 25మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో శుక్లాలతో బాధపడుతున్న 15మందిని ఆపరేషన్ నిమిత్తం హైదరాబాద్‌లోని బాలానగర్ కంటి ఆస్పత్రికి పంపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది సిరాజ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

▪ ప్రమాదకరంగా కల్వర్టు..

మర్పల్లి, మే 29 : మర్పల్లి నుంచి కోట్‌పల్లి వెళ్లే రోడ్డు కల్వర్టు ప్రమాదకరంగా మారింది. ప్రయాణికులు, వాహనదారులు ప్రమాదాలకు గురైన ఘటనలు ఉన్నాయి. ఈ రోడ్డుపై కోట్‌పల్లి, పెద్దేముల్, తాండూరు, బంట్వారం మండలాల నుంచి రాకపోకలు సాగుతుంటాయి. తాండూరు నుంచి పెద్దపెద్ద వాహనాలు సిమెంట్ లోడుతో ఈ రోడ్డుపై వెళుతుంటాయి. రాత్రుల్లో కల్వర్టు వద్ద గుంతలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

కట్టుకున్నోడి కిరాతకం..

పాలు విరిగాయని ప్రాణాలు పోయేలా చిత్రహింస

ఒళ్లంతా వాతలు తేలేలా దెబ్బలు

అదనపు కట్నం కోసం వేధింపులు

మూడ్రోజులపాటు నిర్బంధం.. నరకం

అపస్మారస్థితిలో అబల.. దవాఖానకు తరలింపు

మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదు

వెంగళరావునగర్, మే 29: కట్టుకున్న భర్తే కిరాతకుడిగా మారాడు. పొయ్యిపై వేడి చేసిన పాలు విరిగాయన్న నెపంతో అత్తింటి వారు ఆ అబలపై తమ ప్రతాపం చూపారు. అదనపు కట్నం తెమ్మంటూ రాచి రంపాన పెట్టారు. ఒళ్లంతా వాతలు తేలేలా మెటల్ పైపుతో మూడ్రోజుల పాటు కొట్టి నరకం చూపారు. ఈ అమానవీయమైన ఘటన మధురానగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఎల్లారెడ్డిగూడలో జరిగింది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. సనత్‌నగర్ అల్లాఉద్దీన్ కోఠికి చెందిన హీనా బేగం(28) వివాహం నాలుగేళ్ల కిందట ఎల్లారెడ్డిగూడకు చెందిన కారు డ్రైవర్ అక్మల్ హుస్సేన్(42)తో పెద్దలు సమక్షంలో జరిగింది. కట్నకానుకల కింద రూ.2 లక్షల నగదు, నాలుగున్నర తులాల బంగారం, ఇతర లాంఛనాలు ఇచ్చి ఘనంగా పెండ్లి చేశారు. అప్పటికే అక్మల్ హుస్సేన్‌కు మెదటి పెండ్లి అయిన విషాయాన్ని దాచిపెట్టారు. తర్వాత బేగంకు తెలిసినా సర్దుకుని కాపురం చేయసాగింది. కొన్నాళ్ల పాటు వీరి కాపురం సజావుగా సాగటంతో ఓ కుమారుడు, కుమార్తె జన్మించారు. పెళ్లి అయినప్పటి నుంచి భర్త అక్మల్ హుస్సేన్, అత్త అఫ్రోజ్ బేగం, ఆడపడుచు సోని, మరుదులు తబ్రేజ్, అయ్యూబ్ కలిసి ఆమెను శారీరకంగా, మానసికంగా హింసించారు. పుట్టింటి నుంచి అదనపు కట్నం తేవాలని ఆమెను చీటికి మాటికి కొట్టారు. కూతురు కాపురం బాగు పడుతుందన్న ఆశతో అప్పుచేసి రూ.2.50 లక్షలు వరకు అత్తింటి వారికి ముట్ట జెప్పారు. అయినా అత్తింటి వారి వేధింపులు తగ్గలేదు. కాగా, అత్తింట్లో పొయ్యిపై పాలు వేడి చేసి మరిగించే సమయంలో పాలు విరిగిపోయాయి. దీంతో ఆగ్రహానికి గురైన భర్త, అత్త, ఆడపడుచు, మరిది కలిసి ఆమెపై మెటల్ పైపుతో విచక్షణారహితంగా చితకబాది, ఇంట్లోనే మూడ్రోజుల పాటు నిర్బంధించారు. ఒళ్లంతా గాయాలతో కమిలిపోయింది. మీ కూతురు చనిపోయిందంటూ ఆమె పుట్టించి వారికి ఫోన్ చేసి చెప్పారు. అపస్మారకస్థితిలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న కుమార్తెను చూసిన తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. అత్తింటివారి దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితురాలిని చికిత్స నిమిత్తం అమీర్‌పేటలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హీనా వీపు పై పైపుతో కొట్టిన గాయాలు

మద్యం మత్తులో డ్రైవింగ్.. ఇద్దరికి గాయాలు

ఒకరి పరిస్థితి విషమం.. మరో మహిళకు గాయాలు

సైదాబాద్, మే 29: మద్యం మత్తులో కారును అతివేగంతో నడిపి.. ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టాడు. ద్విచక్ర వాహనదారుడికి గాయాలయ్యాయి. తప్పించుకునే క్రమంలో అదే వేగంతో కారులో ముందుకు దూసుకెళ్లి మరో మహిళను ఢీకొట్టాడు. ఆమెకు కూడా గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల, స్థానికుల కథనం ప్రకారం.. కొత్తపేట హుడా కాంప్లెక్స్‌కు చెందిన బనోతు ధర్మనాయక్ (25) బుధవారం తన తండ్రి బనోతు కిషన్‌నాయక్‌ను సైదాబాద్ కాలనీలో దింపి, తిరిగి బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. సైదాబాద్ ఎస్బీహెచ్ బ్యాంక్ కాలనీ కమాన్ వద్దకు రాగానే.. కాలనీలోనుంచి దూసుకొచ్చిన కారు ఢీకొట్టింది. కారు డ్రైవింగ్ చేస్తున్న లక్ష్మీనగర్ కాలనీకి చెందిన ప్రణయ్‌కుమార్ రెడ్డి మద్యం మత్తులో ఉన్నట్టు గుర్తించారు. ఈ ప్రమాదంలో ధర్మనాయక్ తలకు, కుడి కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదాన్ని గమనించిన స్థానికులు ఘటనా స్థలానికి వచ్చే సరికి కారును ఆపుకుండా వెళ్లే ప్రయత్నంలో వాకింగ్ చేసి ఇంటికి వెళ్తున్న శ్రీలక్ష్మిని ఢీ కొట్టాడు. దీంతో ఆమెకు చేతికి, కాళ్లకు గాయాలు కావడంతో అక్కడి నుంచి కారుతో పారిపోయాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని.. కారు ప్రమాదంలో గాయపడ్డ ధర్మనాయక్‌ను చికిత్స నిమిత్తం కొత్తపేటలో ఓజోన్ దవాఖానకు 108 అంబులెన్స్‌లో తరలించారు. తలకు బలమైన గాయాలు కావడంతో అతడి పరిస్థితి విషమంగా ఉన్నదని వైద్యులు చెప్పినట్టు బాధితుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిర్లక్ష్యంగా కారు డ్రైవింగ్ చేసి రెండు ప్రమాదాలు చేసిన ప్రణయ్‌కుమార్ రెడ్డిని అరెస్టు చేసి, కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సైదాబాద్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న కారు

వ్యక్తి ఆత్మహత్య

కులకచర్ల, మే 29 : చౌడాపూర్ మండలం నీర్‌సాబ్ తండాకు చెందిన కాట్రావత్ రవి(37) ఇంటిని నిర్మించుకున్నారు. దీంతో అప్పులు కావడంతో వాటిని తిరిగి చెల్లించలేక బుధవారం తాను హెయిర్‌కటింగ్ చేయించుకొని వస్తానని తన భార్య నీలమ్మకు చెప్పి తన పాత ఇంటికి వెళ్లి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య నీలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట ఎస్ఐ అభిషేక్‌రెడ్డి తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ అర్జెంట్‌గా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & ITI మెకానిక్స్ కావలెను. మంచి జీతం, వసతి సౌకర్యం కలదు. సంప్ర: 9392663777, 9246663777, 9290003999.

NT-339514-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఆన్‌లైన్‌లో ఉద్యోగం పేరుతో బురిడీ

బంజారాహిల్స్, మే 29: ఆన్‌లైన్‌లో ఇచ్చే టాస్క్‌లు పూర్తిచేసి, ఇంట్లో ఉండి డబ్బులు సంపాదించవచ్చంటూ నమ్మించిన సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. ఈ ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నం.11లో నివాసముంటున్న వాసగిరి నాగరవి కిరణ్ పార్ట్‌టైమ్ జాబ్ కోసం చూస్తున్నాడు. ఇటీవల అతడి వాట్సాప్ నంబర్‌కు ఓ మెసేజ్ వచ్చింది. గ్రాబ్ జాబ్ అనే సంస్థలో ఉద్యోగం ఉన్నదని చెప్పి, అన్ని వివరాలను సేకరించారు. సంస్థ ఇచ్చే టాస్క్‌లను పూర్తిచేస్తుంటే డబ్బులు ఇస్తామని నమ్మబలికారు. కొన్నాళ్లపాటు కొన్ని టాస్క్‌లను అప్పగించి, డబ్బులు పంపించారు. ఆ తర్వాత మరిన్ని టాస్క్‌లంటూ రూ. 44, 241 ఫోన్ పే ద్వారా తీసుకున్నారు. డబ్బులు తీసుకున్న తర్వాత టాస్క్‌లు ఇవ్వకపోవడంతో పాటు అకౌంట్ బ్లాక్ చేశారు. మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు బుధవారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పార్క్ చేసిన 22 బైకుల చోరీ

జగద్గిరిగుట్ట, మే 29 : బైక్ చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని జగద్గిరిగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం పీఎస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బాలానగర్ ఎసీపీ హనుమంతరావు, ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ వివరాలను వెల్లడించారు. సూరారం కాలనీ సమీపంలోని కృష్ణానగర్ నివాసి ఆనందరెడ్డి(28) జులాయిగా తిరుగుతూ ఇంటి వద్దే ఉంటున్నాడు. కొంతకాలంగా వైన్స్ షాపుల వద్ద పార్క్ చేసిన బైకులను చోరీ చేస్తున్నాడు. జగద్గిరిగుట్ట, బాచుపల్లి, రామచంద్రాపురం, మేడ్చల్, పేట్‌బషీరాబాద్ ఠాణాల పరిధిలో చోరీలు చేశాడు. సంగారెడ్డి, రాచకొండ, మెదక్ పరిధిలోని చౌటుప్పల్, శామీర్‌పేట, తూప్రాన్, గజ్వేల్, బొల్లారం, సంగారెడ్డిలో కూడా దొంగతనాలకు పాల్పడ్డాడు. నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు.. అతడి వద్ద నుంచి 22 బైకులు, ఒక ఆటో స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

బాలికతో అసభ్య ప్రవర్తన..

కాచిగూడ,మే 29: వెంకటాద్రి రైల్లో బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిని కాచిగూడ రైల్వే పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప కథనం ప్రకారం.. కడప జిల్లా కోడూరు ప్రాంతానికి చెందిన ప్రతాప్ (41) వెంకటాద్రి రైల్లోని ఎస్-3 బోగిలో కాచిగూడకు వస్తుండగా..అదే బోగిలో ప్రయాణిస్తున్న నల్లకుంట ప్రాంతానికి చెందిన 15 ఏండ్ల బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక ఫిర్యాదు చేసింది. బాలిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న రైల్వే పోలీసులు బుధవారం ప్రతాప్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు హెడ్ కానిస్టేబుల్ బీజీ ప్రసాద్‌రావు తెలిపారు.

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

Telangana Today

FOR LOCAL TO GLOBAL NEWS

పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.

ప్రకటనల విభాగం సెల్: 80966 77655

వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి తాండూర్/కొడంగల్ } 80966 77668

ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962